క్లుప్తంగా

ప్రజాభిప్రాయ సేకరణ

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం జరిగిన గ్రామసభలో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. మొలంగూర్ అనుబంధ గ్రామాలు నల్లవెంకయ్యపల్లి, గుడాటిపల్లి నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు ప్రక్రియ జరిగింది. కొంతమంది అభ్యంతరాలు చెప్పడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామసభ నిర్వహించగా నల్లవెంకయ్యపల్లి గ్రామం నుంచి మెజార్టీ ప్రజలు రాకపోవడంతో మంగళవారం గ్రామసభ నిర్వహిస్తామని ఎంపీడీవో కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. మొలంగూర్ గ్రామస్తులు ఉమ్మడిగానే కొనసాగించాలని మెజార్టీ ప్రజలు అభిప్రాయాలు వెల్లడించారు.

మాలల ఒత్తిడితోనే వర్గీకరణ జాప్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మానకొండూర్: గన్నేరువరం మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ అనుబంధసంఘాల సమావేశం జరిగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌మాదిగ హాజరై మాట్లాడారు. మాలల ఒత్తిడికి తలొగ్గి సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి ప్రోత్సాహం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. వర్గీకరణ లేకుండా టీచర్ ఉద్యోగాలు భర్తీచేసిన సీఎం మాదిగలకు ద్రోహం చేశారని, రాష్ట్రంలో వర్గీకరణ అమలయ్యేంత వరకు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు రామంచ సంపత్, బాబు, పురేశ్, సతీష్, మనోహర్, రాజుకుమార్, అంజిబాబు, వసంత్, అనిల్, రాజన్న, కొమరన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న పూర్ణిమ

జమ్మికుంట: విద్యార్థులు ఇష్టంతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు పూర్ణిమ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. పట్టుదలతో 10 జీపీఏ సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జరీనా అంజుమా, టీచర్లు సంతోష్‌కుమార్, రమేష్, అవినాష్, ఐలయ్య, స్రవంతి విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

జమ్మికుంట: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమని కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో బూత్ కమిటీల సహయోగి నియామక కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ఇంటింటికి పథకాలను తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, పల్లపు రవి, ఇటుకాల స్వరూప, తూడి రవిచంద్రరెడ్డి, మోడెం రాజు, రాజేష్, జగన్ పాల్గొన్నారు.

శక్తి కేంద్రం ఇన్‌చార్జీల సమావేశం

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జీల సమావేశం సోమవారం జరిగింది. ఈకార్యక్రమంలో ఎన్నికల సహయోగి పుప్పాల రఘు పాల్గొని మాట్లాడారు. నూతన బూత్ కమిటీల ఏర్పాటు కోసం 200 సాధారణ సభ్యుల జాబితాను రికార్డు పుస్తకంలో త్వరగా పూర్తిచేసి ఇవ్వాలన్నారు. బూత్‌మిటీల ఏర్పాటులో క్రియాశీల సభ్యులకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రంగు భాస్కరాచారి, తిరుపతి,రాజు, లక్ష్మణాచారి, శ్రీనివాస్, రాజిరెడ్డి, కత్తి ప్రభాకర్‌గౌడ్, రాజిరెడ్డి, కోటేశ్వర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని పలు బూత్‌ల్లో బీజేపీ నాయకులు సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. నాయకులు ఇంటింటా తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య, నాయకులు గుర్ల అనిల్, అపరాధ రమణ, మొలుగూరి రాజు, సందీప్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పడిపూజ



తిమ్మాపూర్: మహా పడిపూజలో భరత్‌శర్మ, భక్తులు



చొప్పదండి పట్టణంలో...



చిగురుమామిడి: భగవద్గీత ప్రచారం



మద్దికుంటలో అయ్యప్పస్వాములకు భిక్ష

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ పొన్నం సునీత అనిల్‌గౌడ్ నివాసంలో ఆదివారం సాయంత్రం అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సంకే పల్లి భరత్ శర్మ హాజరయ్యారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనాతర ధర్మ పరిరక్షణకు ప్రతీ హిందువు సిద్ధపడాలని, దేశంలో లౌకికవాదం ముసుగులో హిందువులపై దాడులు పెరుగుతున్నాయని, పాశ్చాత్య పోకడలతో హిందూ ధర్మం అవమానానికి గురవుతోందన్నారు. మన ధర్మాన్ని, ఆలయాలను మనమే అభివృద్ధి చేసుకోవాలన్నారు. స్థానిక అయ్యప్ప ఆలయాల అభివృద్ధికి అయ్యప్పస్వాములు కృషి చేయాలని సూచించారు.

చొప్పదండి: పట్టణంలోని మాజీ వార్డు సభ్యులు, వస్త్రోత్పత్తి సంఘం అధ్యక్షుడు ఎన్నం మునీందర్, పద్మ దంపతులు మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ ప్రధాన అర్చకులు పాలోజు చరణాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టగా ఆలయ అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సత్యానందం, కత్తి రమేశ్, సింహాచలం హరికృష్ణ, మునిగాల సుధాకర్ గౌడ్, పొరండ్ల భాస్కర్, దండె లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని మద్దికుంట గ్రామంలో కులమతాలకు అతీతంగా అయ్యప్ప స్వాములకు ముస్లింలు ముస్తాఫా, తాజ్ సోమవారం భిక్ష ఏర్పాటు చేశారు. ఏటా అయ్యప్ప స్వాములకు భిక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలోఆంజనేయస్వామి, గణేష్ ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

భగవద్గీత ప్రచారం

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి, రాములపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రభోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హుజూరాబాద్‌కు చెందిన కమిటీ సభ్యులు ఇంటింటా భగవద్గీత కరపత్రాలను పంపిణీ చేశారు. మార్గశిరంలో భక్తితో ఉండాలని, గ్రంథ పఠనం చేస్తే జ్ఞానం పెంపొందుతుందన్నారు. కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, గోపికృష్ణ, కుమారస్వామి, రామస్వామి, రాహుల్, కుమార్, సాయి, శ్రీదేవి, ప్రియాంక, పద్మ, మౌనిక, చంద్రవ్వ, జ్యోతి, సరిత, సిద్ధార్థ, నక్షత్ర, అద్వితీయ, రావణ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట దేశాయిపేట రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

చొప్పదండి: చెరువును నమ్ముకొని పంటలు సాగు చేశామని, ఇప్పుడు కొందరు తప్పుడు ప్రచారంతో పంటల సాగును దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని మండలంలోని దేశాయిపేట రైతులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రైతుల వివరాల ప్రకారం దేశాయిపేట రైతులు గ్రామంలోని కుంటనీటితో ఐదేళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. తాజాగా కొందరు కుంటలోని నీటిని తరలించొద్దంటూ అధికారులను సంప్రదించారని, ఒక్కో రైతు రూ. లక్షల వరకు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తుండగా ఇప్పుడు వారి పొట్ట కొట్టాలనుకోవడం తగదన్నారు. మెట్ట ప్రాంతంలో కాలువల ద్వారా నీటి సాగుకు నోచుకోలేక పోతున్నామని, మోటార్ల ద్వారా సాగును కూడా అడ్డుకోవాలనుకోవడం దారుణమన్నారు. పంటలు సాగు చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కుంటలో నీటితో వ్యవసాయం చేస్తే, చెరువు నీటిని వాడకుంటున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గొలుసుకట్టు చెరువుల ఉద్దేశం మొదట పంటల సాగు చేయడమేనని అధికారులు గుర్తించాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించినట్లు రైతులు తెలిపారు.

నూతన కార్యవర్గం



రాజ్‌కుమార్

తిమ్మాపూర్: ప్లంబర్ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడిగా మహాత్మానగర్ గ్రామానికి చెందిన కాశిపాక రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నం మల్లేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు కన్నం సంపత్ ఆధ్వర్యంలో మండలంలోని ఎల్ఎండీలో సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో సభ్యులు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కన్నం చందు, మహంకాళి మనోహర్, ప్రధాన కార్యదర్శిగా బామండ్ల రాజు, కోశాధికారిగా ఓగుల తిరుపతి, బామండ్ల శివకుమార్, ముఖ్య సలహాదారుడిగా కన్నం మల్లేష్, లక్ష్మణ్, సంపత్, కార్యవర్గ సభ్యులుగా కొండ్ర దిలీప్, కన్నం మహేష్, బామండ్ల నర్సింగరావు, మంద మల్లేష్, బాబు, బామండ్ల సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ అర్కాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌జీటీలకు ఎంఎల్‌సీ ఓటుహక్కును కల్పించాలని కోరారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యురాలు జానకిదేవి, పలువురు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

చొప్పదండి: గామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక భరోసా కింద ఎనభై మంది కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకులను ఫౌండేషన్ డైరెక్టర్ జోగు పొలు, ప్రధాన కార్యదర్శి పొత్తూరి సురేశ్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 80 కుటుంబాలను ఎంపిక చేసి నిత్యావసర సరుకులు, ఇరవై కుటుంబాలకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం చేశామన్నారు. ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, నిజానపురం చందు, దామెర విద్యాసాగర్‌రెడ్డి, రాపెల్లి ఐలయ్య, ఎన్నం మునీందర్, తుకారం, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

పాత సత్యంకు అంబేడ్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సత్యం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాత సత్యంకు ఢిల్లీలోని పంచశీల క్షేత్రంలో దళిత సాహితీ అకాడమీ జాతీయ అధ్యక్షుడు, మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్పీ సుమనాక్షర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డును ప్రదానం చేశారు. సర్పంచ్‌గా, సోషల్ వర్కర్, అంబేడ్క్ సంఘాల బలోపేతానికి కృషి చేసినందుకు అవార్డు దక్కిందని సత్యం తెలిపారు. అవార్డుకు సహకరించిన జాతీయ సెలక్షన్ కమిటీ సభ్యులు, రాష్ట్ర నాయకుడు రామూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. భిక్షపతి, మహేందర్, మహమ్మద్ సలీం, ముస్తాఫా, పాత శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్‌పై అవగాహన

మానకొండూర్: గన్నేరువరం మండలం ఖాసీంపేట గ్రామంలో సోమవారం దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వర్మీకంపోస్ట్‌పై అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఆఫీసర్ బొర్ర రమేశ్ మాట్లాడుతూ.. రైతులు అనేక రసాయనాలు వాడటంతో భూమి నిస్సారం అవుతుందని, దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోతున్నారని, వర్మీకంపోస్ట్ తయారీ, లాభాలను వివరించారు. ఈకార్యక్రమంలో మహేశ్, మనీషా, రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో సోమవారం జయన్న ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించామని ఫౌండేషన్ చైర్మన్ గుడిపాటి జైపాల్ రెడ్డి తెలిపారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామన్నారు. వీరిలో 53 మందికి శస్త్ర చికిత్స అవసరం కాగా వారిని బస్సులో హైదరాబాద్‌కు తరలించామన్నారు. సింగాపూర్ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సరిత, సమ్మయ్య, శివ, ఇమ్మడి దయాకర్, వేల్పుల రత్నం పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

మానకొండూర్: మానకొండూర్ ప్రభుత్వ వైద్యశాలలో రెగ్యులర్ డాక్టర్‌గా ఎండీ సల్మాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు, చికిత్స చేసుకోవాలన్నారు. బీపీ, షుగర్ మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

వరికొయ్యలు కలియదున్నాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో రాజ్‌కుమార్

శంకరపట్నం: రొటోవేటర్‌తో వరికొయ్యలు కలియదున్నాలని ఏఈవోలు రాజ్‌కుమార్, కీర్తన రైతులకు సూచించారు. వరికొయ్యలు కాల్చొద్దని, భూమికి మేలు చేసే కీటకాలు చనిపోతాయన్నారు. రొటోవేటర్‌తో కలియదున్నడంతో నెల రోజుల్లో పోషకాలు తయారవుతాయని పేర్కొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



హుజూరాబాద్: మానవ వికాస వేదిక ఇరవై ఏళ్ల ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని పట్టణంలోని మానవ వికాస వేదిక కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 14, 15వ తేదీల్లో ఉత్సవాలు జరగనున్నాయని నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె. వీరమణి, జస్టిస్ గురుజాల రాధారాణి, నరేంద్ర నాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంటాల బుచయ్య, జిల్లా అధ్యక్షుడు బోగం రమేష్, కోశాధికారి సుందరయ్య, ఉపాధ్యక్షుడు కొంకటి స్వామి, మాజీ ఎంపీపీ వెంకట్రాజం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్వల మల్లయ్య తదితరులున్నారు.

ఎంఈవోకు వీడ్కోలు



చొప్పదండి: బదిలీపై వెళ్లిన ఎంఈవో అంబటి వేణుకుమార్‌ను మండలంలోని ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంఈవో శ్రీనివాస్, మండలంలోని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

శంకరపట్నం: సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు పంచాయతీ కార్యదర్శులు సోమవారం వినతిపత్రం అందజేశారు. సెలవు దినాల్లో పని, ఒత్తిడితో పాటు ఆర్థికభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని ఎంపీడీవోతో పాటు ఎంపీవో ప్రభాకర్‌కు పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

సీఎం కప్ పోటీలు

రామడుగు: మండల కేంద్రంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నామని ఎంపీడీవో రాజేశ్వరీ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



హుజూరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: హుజూరాబాద్, చొప్పదండి,మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం, రక్తదానం నిర్వహించారు. సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



మానకొండూర్: మండలంలోని పచ్చునూరు గ్రామ శివారులో జమ్మికుంట-కరీంనగర్ రోడ్డు వెంట హరితహారంలో నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో మొక్కలు పశువులకు ఆహారంగా మారడంతో వాటి స్థానంలో గుంతలు మాత్రమే కనిపిస్తున్నాయి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారులు
శ్రీనివాస్, ఏపీవో, మానకొండూర్ సెల్ నం. 9121209921

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్రీడా వార్తలు

ప్రతిభా పరీక్షలో ప్రథమ స్థానం

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని కె. రష్మిత తెలంగాణ బయోసైన్స్ ఫోరం రామడుగు వారు నిర్వహించిన బయోసైన్స్ ట్యాలెంట్ టెస్టులో ప్రథమ స్థానం నిలిచింది. విద్యార్థి రష్మితను పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కోల రమేశ్ ఉపాధ్యాయులు అభినందించారు.

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మానకొండూర్‌లో సోమవారం జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండల విద్యాధికారి మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులు గంగారం, సురేందర్, శ్రీధర్ రెడ్డి, సత్యనారాయణ, జయేందర్, శ్రీనివాస్, వసుమతి,అర్చన,జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. ప్రథమ విజేతలుగా త్రివేణి (పచ్చునూర్), అశ్విత(కేజీబీవీ మానకొండూరు),రాజు(బాలుర పాఠశాల మానకొండూరు), హర్షవర్దన్ (టీజీఎంఎస్ పచ్చునూర్), ద్వితీయ విజేత సనుఫా ఫాతిమా(బాలికల పాఠశాల, మానకొండూర్), ఆదిలక్ష్మి(బాలికల పాఠశాల, మానకొండూర్), తనూజావర్ధన్(టీజీఎంఎస్)ను ప్రకటించారు. మండల స్థాయి విజేతలు 18న జిల్లా స్థాయిలో జరిగే ప్రతిభా పరీక్షకు హాజరవుతారని నిర్వాహకులు సురేందర్, గంగారాం తెలిపారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు ఇద్దరు చొప్పున హాజరయ్యారు. ఇందులో భాగంగా మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఇల్లందకుంట పాఠశాలకు చెందిన ఓరుగంటి గణేశ్, ద్వితీయ స్థానం సిరిసేడు పాఠశాల విద్యార్థి నాగపురి రామ్‌చరణ్‌ను మండల విద్యాధికారి కె.రాములు, ఇల్లందకుంట హెచ్ఎం కె.జయప్రకాశ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పరీక్ష నిర్వాహకురాలు జే.రాధికరాణి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రాణింపు

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని విన్నర్స్ ఎడ్జ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాల్గో రాష్ట్ర స్థాయి కుంగుపూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. కె.కృతిశ్రీ, మనుశ్రీ, రమ్యశ్రీ, సిరిచందన, హర్షవర్దన్ బంగారు, వి.మనుశ్రీ, సాత్విక, సాయి రాంగౌడ్, అద్నన్, వన్షిక వెండి పతకాలు సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ మల్లయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇల్లందకుంట: ఉమ్మడిజిల్లా స్థాయి అండర్-14 బాల,బాలికలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో క్రీడామైదానంలో ఈ నెల 4న జరిగిన నెట్‌బాల్ పోటీల్లో మండలంలోని సిరిసేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నాగపూర్ చరణ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్ఎం జగదీశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక శిక్షణ పాఠశాల ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి జి. ప్రసాద్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-19 విభాగం రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ జి. కాళహస్తి, శ్రీనివాస్, ఇనాక్, బాల సుందర్‌రావు, విక్రమ్ అభినందించారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

హుజూరాబాద్: అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచులు వెళ్తున్నారనే సమాచారంతో సోమవారం ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. రంగాపూర్ మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, గత ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్ మనోహర్, నిరోషా కిరన్, పాకాల లక్ష్మారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మనోహర్‌లున్నారు.

చిగురుమామిడి: మాజీ సర్పంచ్‌ల అరెస్టు సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ అన్నారు. చిగురుమామిడిలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. పెండింగ్ బిల్లుల రాక ఇబ్బందులు పడుతున్న అంశాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు గూల్ల సంపత్, బుర్ర సదానందం, బట్టు ప్రవీణ్, గుడాల ఓదయ్య, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

హస్త కళలపై పోటీలు



బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిమ్మాపూర్: ప్రజాపాలన విజయోత్సవాల్లోభాగంగా గోల్కొండ హస్తకళల ఫిలిగ్రీ, రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ ఎల్ఎండీ కాలనీ ఆధ్వర్యంలో సోమవారం హస్తకళలు, ప్రాధాన్యతపై ఎల్ఎండీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం పరాంకుశం శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యాసరచన పోటీలు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందిస్తాయని తెలిపారు. చిత్రలేఖనం విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయొచ్చన్నారు. కార్యక్రమంలో హస్తకళ డిపొల్ మేనేజర్ మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహాలు ఆవిష్కరించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న జేఏసీ సభ్యులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఆవిష్కరించాలని జేఏసీ కన్వీనర్లు వంతడుపుల సంపత్, మాతంగి శంకర్, గుండ్ల రాజయ్య, బోయిని తిరుపతి, అంబాల సతీష్, సభ్యులు అఖిల్, పారునంది జలపతి, ఖమ్మం కృష్ణ సోమవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ని కోరారు. మూడేళ్లుగా ఆవిష్కరణకు నోచుకోవడం లేదని, గత ప్రభుత్వ మంత్రి, ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండాపోయిందని, దేశ ప్రజలు దైవంగా భావించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాపు జగ్జీవన్ రామ్ విగ్రహాలకున్న ముసుగులను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు